

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల వితరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా అన్నారు. శుక్రవారం నవజీవన్ నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న వృద్ధులకు దోమతెరలు, స్టీల్ ప్లేట్లు, టిఫిన్ క్యారియర్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా ఎరముక్కపల్లెలో నవజీవన్ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న 30 మంది వృద్ధులకు అవసరమైన దోమతెరలు, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, టిఫిన్ క్యారియర్లను పంపిణీ చేశామన్నారు. సేవా కార్యక్రమము కళాశాలకు గర్వకారణమని ప్రోగ్రాం అధికార్లను అభినందించారు. వసతి గృహ నిర్వాహకులు శేఖర్ మాట్లాడుతూ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం తమకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



- 3 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు
- ఇఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూపులు
- పండగ పూట పస్తులే
- పట్టని పాలక వర్గం.. అధికారులు
- ఆందోళన ఉధృతం చేయనున్న కార్మిక సంఘ నాయకులు
- 23న కార్పొరేషన్ ముట్టడికి సన్నాహాలు

కష్టాల కడలిలో మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరపాలక సంస్థ పరిధిలో కోవిడ్-19, అడిషనల్ కార్మికులు 430 మంది పని చేస్తున్నారు. వీరికి 3 నెలల నుంచి వేతనాలు అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇఎస్, పిఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుకుంటున్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వేడుకుంటున్నారు. అయినా పాలకవర్గం, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వేతనాలు అందని కార్మికులు ఈ నెలలో వచ్చే క్రిస్మస్, 2025, జనవరిలో వచ్చే సంక్రాంతి పండగ పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పండగపూట అందరిలా పండుగ చేసుకునే పరిస్థితి లేదు. క్రిస్టియన్ పండగను చేసుకునేవారిలో ఎక్కువ మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. పెండింగ్ వేతనాల కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకులు నిరసన, అర్ధనగ్న ప్రదర్శన, 24 గంటల ధర్నా చేపట్టారు. అయినా పాలక వర్గం, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కార్మికులు అస్వస్థతకు గురై పని చేయకపోతే పాలకవర్గం, అధికారులు ఎందుకు పని చేయలేదు..తొలగిస్తామని బెదిరించడంలో ముందుంటారు. వీరు వేతనాలు మంజూరు చేయడంలో మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరించడం దారుణం. కార్పొరేషన్‌లో నివసిస్తున్న ప్రజానీకానికి అవసరమైనంత మంది కార్మికులు లేకపోయినా ఉన్న కార్మికులు నగరాన్ని సుందరీకరిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి కూడా పారిశుధ్య కార్మికులు పనులు చేస్తున్నారు. కోవిడ్ సమయంలో పరిసరాల శుభ్రతకు తీసుకున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సేవలను గుర్తించి సన్మానాలు, పొగడ్తల్లో ముంచెత్తాయి. కోవిడ్ నుంచి దేశం, రాష్ట్ర కోలుకున్న తరువాత ఆదే కార్మికులను తొలగించాలని ప్రయత్నాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి. అందులో భాగంగా వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని కార్మికులకు వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ఉంది. ప్రజల నుంచి పన్నులు ముక్కు పిండి వసూలు చేసే అధికారులు కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో మాత్రం తమకు సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులకు నెలలో 2,3వ తేదీల్లో వేతనాలు పడుతుంటాయి. ఆలస్యమైతే వేతనాల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తుందంటూ గగ్గోలు పెడుతుంటారు. మరి అతితక్కువ వేతనాలతో పని చేసే కార్మికులకు 3 నెలల నుంచి వేతనాలు అందకపోతే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. ఇప్పటికైనా పాలకవర్గం, సంబంధిత అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించి పండుగపూట పస్తులు లేకుండా చూడాలని నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు



కోవిడ్-19 కార్మికుడిగా పని చేస్తున్న తమకు 3 నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. పాలకవర్గం, అధికారులు సమస్యను పరిష్కరించి, కార్మికులను ఆదుకోవాలి.

- రాజు, కోవిడ్-19 కార్మికుడు, కడప.

అప్పులు చేయాల్సిన పరిస్థితి



3 నెలలుగా తమకు రావాల్సిన వేతనాలు అందక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేతనాలు వస్తే పూటగడిచే కార్మికుల పట్ల వివక్ష చూపడం పాలకవర్గం, అధికారులకు సరికాదు. పండుగలు కూడా దగ్గరలో ఉన్నాయి. వేతనాలు చెల్లిస్తే పండుగ చేసుకుంటాం. లేకుంటే పస్తులే.

- ఈశ్వర్, అడిషనల్ కార్మికురాలు, కడప.

వేతనాలపైనే ఆధారపడ్డాం..



నగర పాల కసంస్థలో అడిషన్ కార్మికుడిగా పని చేస్తున్నాను. మాజీవితం వేతనాలపై ఆధారపడి ఉంది. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న మాకు పాలకవర్గం, అధికారులు వేతనాలు పెండింగ్ పెట్టడం బాధాకరం. వెంటనే వేతనాలు చెల్లించి పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలి.

- శివ, అడిషనల్ కార్మికుడు, కడప.

కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం తగదు



కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదు. ఇచ్చే అరకొర వేతనాలు 3 నెలలుగా పెండింగ్ పెట్టడం దుర్మార్గం. నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా పెట్టే కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలి. లేని పక్షంలో ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఇస్తాం.

- పి.వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి, కడప.

కార్పొరేషన్ ముట్టడి తప్పదు



కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని శాంతి యుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాం. పాలకవర్గం, అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలి. లేని పక్షంలో ఈ నెల 23న కార్పొరేషన్ ముట్టడించక తప్పదు. అధికారులు కార్మికులు ఆవేదనను అర్థం చేసుకోవాలి.

- సుంకర రవి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు, కడప.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

పార్లమెంటులో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రిని తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్త్ రఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో చేపట్టిన నిరసనకు నగర కార్యదర్శి ఎ.రామమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం శాస్త్రీయ, హేతుబద్ధమైనది, అలాంటి రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసి పార్లమెంటు సభ్యులైన అమిత్‌షా రాజ్యాంగ విరుద్ధంగా మనువాదిగా అశాస్త్రీయ స్వర్గం, పుణ్యం అనే భాషలు వాడడం రాజ్యాంగ, చట్ట విరుద్ధమని గుర్తు చేశారు. దేశ సామాజిక, సాంస్కృతిక ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా, భారత రాజ్యాంగంలో దేశీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలు అన్నిటినీ కలిపి చేర్చారని తెలిపారు. నిస్వార్థ ప్రజా సేవకుడు, దేశంలోనే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్‌ని తూలనాడుతూ మాట్లాడడం దేశ ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అంశం అన్నారు. బిజెపి నేతలు మనువాదాన్ని పెంచి పోషిస్తున్నారని ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారని చెప్పారు. దీన్ని దేశ ప్రజలు అంగీకరించరని తీవ్రంగా హెచ్చరించారు. దేశంలోని అన్ని కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వాళ్లందరూ ఐక్యంగా పోరాటం చేసి దేశ భవిష్యత్తును అభివృద్ధి చేయడంలో కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, బి.మనోహర్, ఎ.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, వి.అన్వేష్, పి.చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్.భైరవ ప్రసాద్, రామక్రిష్ణారెడ్డి, శివకుమార్, రవి, రాహుల్, నరసయ్య, సురేష్, చాంద్ బాష, సునీల్ కుమార్, రెబ్బ నరసింహులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సబ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్‌లో శానిటేషన్, సెక్యూరిటీ సబ్ కాంట్రాక్ట్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్ ఆవరణంలో ఉండే డెంటల్ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ సైక్రియాటిస్ట్, కేన్సర్ ఆస్పత్రులున్నాయని తెలిపారు. వీటన్నిటికీ సబ్ కాంట్రాక్టర్‌గా బాల నారాయణరెడ్డి వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రతి నెలా 10వ తేదీలోగా వేతనాలు ఇవ్వకుండా ఆయనకు బుద్ధి పుట్టినప్పుడు ఒక నెల అయిపోయి మరో నెల చివరిలో కార్మికుల అకౌంట్‌లో వేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం శానిటేషన్ కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో ఎంఎస్ నంబర్ 549ని విడుదల చేసిందని తెలిపారు. ఈ జీవో ప్రకారం రూ.16వేలు వేతనం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. దీనికి భిన్నంగా నాలుగు నెలల పాటు రూ.10వేలు మాత్రమే కార్మికులకు ఇచ్చేవారని వాపోయారు. అక్కడ శానిటేషన్ కార్మికులు ఆందోళన, పోరాటం చేయడం ఫలితంగా రూ.12,402 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ వాటాలలో కార్మికుల శాతం, కాంట్రాక్టు శాతం కలిపి కార్మికుల జీతం నుంచే కట్ చేసి చెల్లిస్తున్నారని తెలిపారు. అదీ కొందరికి మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్ పిఎఫ్, ఇఎస్ఐ చాలామందికి చెల్లించడం లేదని చెప్పారు. ఎవరైనా కొత్తగా విధుల్లోకి చేరినట్లైయితే వారికి డే ఆఫ్ ఉండవు, సిఎల్ ఉండవు, రూ.12,402 వేతనం ఉండదని చెప్పారు. వారికి కేవలం రూ.10వేలు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నిటిని పరిశీలన చేసే బాధ్యత అక్కడ డిడిలుగా వ్యవహరిస్తున్న వారిదే ప్రధానంగా ఉండాలని పేర్కొన్నారు. వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. యూనిఫామ్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. 2011 నుంచి ఇప్పటివరకు ఆంధ్ర రాష్ట్రానికి ఐదుగురు ముఖ్య మంత్రులు మారారని చెప్పారు. కడప రిమ్స్‌లో మాత్రం బాల నారాయణరెడ్డి అనే సబ్ కాంట్రాక్టర్ కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఇందులో ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఈ నెలలో వచ్చే టెండర్లలో అయినా మెయిన్ కాంట్రాక్టర్ ఎవరైతే ఉంటారో వారే కడప రిమ్స్ బాధ్యతలు చూడాలని సిఐటియుగా కోరుతున్నామని పేర్కొన్నారు. మళ్ళీ సబ్ కాంట్రాక్టర్ ఇతనే కొనసాగితే కార్మికులకు రావలసిన, ప్రభుత్వం నిర్ణయించిన జీతం మొత్తం రాదని హెచ్చరనించారు. సమావేశంలో సిఐటియూ నగర అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై కేసు శోచనీయం

ప్రజాశక్తి - కడప : రాహుల్‌గాంధీపై కేసు పెట్టడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి జకరయ్య మాట్లాడారు. గురువారం పార్లమెంటు ప్రాంగణంలో అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో జరిగిన తోపులాటలో బాధ్యునిగా చేస్తూ రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడాన్ని తప్పు పట్టారు చంద్రబాబు అమిత్‌షాను సమర్థిస్తున్నా అని ప్రశ్నించారు. సమావేశంలో ఎఐసిసి సమన్వయకర్త అబ్దుల్ సత్తార్, ఎస్‌సి సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సాయిజ్యోతి

డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిక దిగుబడులు


ప్రజాశక్తి - వల్లూరు : డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండాల్సిన మొక్కల సంఖ్య కచ్చితంగా ఉండటం వల్ల వరి దిగబడులు నాటు వేసిన వారి కన్నా అధికంగా ఉంటాయని కమలాపురం వ్యవసాయ సహా యకులు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లేబక గ్రామంలో రైతు సాగు చేస్తున్న డ్రమ్ సీడర్ వరి పద్ధతిని మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల వర్షాలు సకాలంలో కురువక పోవడంతో నాటు వేయడం ఆలస్యం అవడం వల్ల వరి దిగుబడులు తగ్గుతా యన్నారు. ఈ నేపథ్యంలో డ్రం సీడర్ తో వరి సాగు చేయుట ఒక ప్రత్యా మ్నా య పద్ధతన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉర్దూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్పు మాధవి ఆకాంక్షించారు. శుక్రవారం ఉర్దూగర్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరతను అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవిని పాఠశాల నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, జిలాని బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ అధ్యక్షులుగా 'వెల్లాల' నియామకం

ప్రజాశక్తి - కడప : వైసిపి ఆర్‌టిఐ జిల్లా అనుబంధ విభాగాలైన సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది వెల్లాల రామకృష్ణారెడ్డిని నియమించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపికి చేసిన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన వైసిపి జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ అవినాష్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగరం మేయర్ సురేష్ బాబుకు, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.



పశువుల షెడ్లు తనిఖీ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : ఎంపిడిఒ కుల్లాయి బాబు బుగ్గలపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల షెడ్డును తనిఖీ చేశారు. రైతు శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. మండలంలో 25 పశువుల షెడ్లు మంజూరయ్యాయని, వీటిలో 22 పశువుల షెడ్లు ప్రారంభమయ్యాయని చెప్పారు.

మాజీ మంత్రి వివేకా హత్య కేసులో వై.ఎస్.మనోహర్‌రెడ్డిని విచారించిన పోలీసులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



న్యాయవాదితో కలిసి విచారణకు వెళ్తున్న వై.ఎస్. మనోహర్‌రెడ్డి

మాజీ మంత్రి వై.ఎస్. హత్యకేసులో ఆయన పిఎ వెంకట కృష్ణారెడ్డి ఇచ్చిన ప్రయివేట్ కంప్లయింట్‌లో సాక్షులుగా ఉన్న కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి చిన్నాన్న అయిన పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వై.ఎస్. మనోహర్‌రెడ్డిని, వేంపల్లె జడ్‌పిటిసి సభ్యులు రవికుమార్‌రెడ్డిని శుక్రవారం డిఎస్‌పి కార్యాలయంలో పులివెందుల డిఎస్‌పి మురళీ విచారించారు. గత సిబిఐ అధికారి రామ్ సింగ్ బెదిరిస్తున్నారని పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబర్ 15న మాజీ మంత్రి వై.ఎస్. వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, సిబిఐ ఎస్‌పి రామ్‌సింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వారిపై ఛార్జ్ షీట్ కూడా పోలీసులు కోర్టులో దాఖలు చేసిన విషయం తెలిసిందే. కానీ గత ప్రభుత్వంలో పోలీసులు ఈ కేసుపై సరైన విచారణ లేకుండా ఛార్జ్‌షీట్ దాఖలు చేసేరనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుపై పూర్తి విచారణ చేయాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఆదేశించడంతో పోలీసులు మళ్లీ దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసుకు సంబంధించి సాక్షులకు సిఆర్‌పిసి 160 కింద పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ నోటీసులు జారీ చేశారు. లాయర్ ఓబుల్‌రెడ్డి, భరత్ కుమార్‌యాదవ్, రఘునాథరెడ్డి, ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, మూలి రాజేష్‌కుమార్‌రెడ్డి, ప్రభావతమ్మ, విఆర్‌ఒ మహేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, భయపరెడ్డిని పోలీసులు ఇదివరకే విచారించారు. వైఎస్ మనోహరెరెడ్డి, వేంపల్లి జడ్‌పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావడంతో న్యాయవాది సమక్షంలో పోలీసులు విచారించారు. వారు ఇచ్చిన వాంగ్మూలాన్ని వీడియో, ఆడియో రికార్డు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపు చేయాలి

ప్రజాశక్తి - కడప



ర్యాలీలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ

విద్యుత్ ఆదా చేయడం వల్ల ఇంధన డిమాండ్ తగ్గి తద్వారా బొగ్గు, చమురు, గ్యాస్ వాడకం తగ్గి వాతావరణం లో కర్బన రసాయన కాలుష్యాలను తగ్గించవచ్చని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విద్యుత్తును పొదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురుంచి ప్రజలలో అవగాహన కలిగించేందుకు కడప మునిసిపల్ గ్రౌండ్ నుంచి అప్సర సర్కిల్ మీదుగా కడప డివిజన్ విద్యుత్ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్య నాయక్, మధుసూదన్, విజిలెన్స్ ఎస్ఐ పి.నరసింహారెడ్డి, ఎస్ఐ హుస్సేన్, డిఇఇలు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ విభాగం వారు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లెలో ఉన్న డా.బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపల్ సునిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ ఎఇ యం. చిన్నయ్య పాల్గొని విద్యార్థులకు ఇంధన పొదుపు, ఇంధన వనరుల వినియోగం వల్ల కలిగే లాభ నష్టాలు గురించి వివరించారు.

మలబార్‌లో డైమండ్ ప్రదర్శన



డైమండ్ షోలో ప్రముఖ వైద్యులు

ప్రజాశక్తి-కడప అర్బన్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కడప షో రూమ్‌లో మైండ్ లైట్ వెయిట్ డైమండ్ ప్రదర్శన నిర్వహిస్తూ ఉన్నామని షోరూమ్ హెడ్ లెసన్ సత్యన్ తెలిపారు. శుక్రవారం డైమండ్ షోరూం ప్రముఖ వైద్యులు డాక్టర్ అవ్వారు శిరీష, డాక్టర్ శివ సింధు, డాక్టర్ హరిత, డాక్టర్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యన్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 25 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. తాజా ఫ్యాషన్ డిజైన్ ప్రతిబింబించేలా ప్రత్యేక ఆభరణాలను రూపొందించారని తెలిపారు. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా డైమండ్స్ హారాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డైమండ్ విలువపై 25 శాతం తగ్గింపు, పాత వజ్రాల మార్పిడి పై 100 శాతం విలువ అందిస్తున్నామని తెలిపారు. సామాజిక కార్యక్రమాలను కూడా కొనసాగిస్తూ ఉన్నామని చెప్పారు. ప్రదర్శనను ప్రారంభించిన వైద్యులు మాట్లాడుతూ మలబార్ ప్రత్యేక మైన్ లైట్ వెయిట్ డైమండ్ ఆభరణాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో షోరూం మార్కెటింగ్ హెడ్ ఇషాక్ బాషా పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి : కలెక్టర్

-26న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటన


ప్రజాశక్తి - కడప: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో నీతి ఆయోగ్ సిఇఒ విసి ద్వారా సమీక్షించారు కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'నీతీ ఆయోగ్' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లాల్లో భాగంగావైఎస్ఆర్ జిల్లాలో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. సంబందిత శాఖలు అన్ని పారమీటర్లలో వంద లక్ష్యాలను **26 నుంచి కేంద్ర మంత్రి జిల్లాలో పర్యటన..** యాస్పిరేషన్‌లోభాగంగా జిల్లాలో జరుగుతున్న ప్రగతిపై సమీక్షించేందుకు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు. 26 నుండి 28వ వరకు మూడు రోజుల పాటు సికే దిన్నె, పెండ్లిమర్రి, జమ్మల మడుగు మండలాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రగతిని ఆయన పరిశీలిస్తారన్నారు.

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎపిజిఇఎ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామ నాయుడు, రాష్ట్ర కోశాధికారి డి. శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులు ఎం.ఎ. ప్రసాద్ గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ భాగ్య ప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సుమర్ జి, సి.నజీర్ జి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్. గిరిధర్, కార్యనిర్వహక కార్యదర్శులుగా ఎస్. జిగాని బాష, మహిళా విభాగం పి. భువనేశ్వరి, కోశాధికారి మహేశ్వర రెడ్డి, డి ఈ సి మెంబర్స్ గా బి.ప్రత్యూష ఎస్.విజయ, రాష్ట్ర ఈసీ మెంబర్ గా ఎస్. మహబూబ్ రహమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రఘురామ నాయుడు మాట్లాడుతూ డిమాండ్స్ సాధన కోసం కృషి చేయాలని నూతన నాయకత్వానికి పిలుపునిచ్చారు. స్టోర్ కీపర్‌లను జూనియర్ అసిస్టెంట్ గా మార్చేందుకు శాయశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సురేంద్రనాథ్, జిల్లా మాజీ అధ్యక్షులు బి.వి.వి.ఫణీంద్ర, పుల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మహేష్, శ్రీహరి, రాజశేఖర్, వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం



కడప సెంట్రల్ జైలు నుంచి విడుదలై వస్తున్న నిందితులు

పరిటాల రవి హత్య కేసులో నిందితులకు బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిటాల రవి హత్య కేసులో కడప సెంట్రల్ జైలులో ఉన్న ఐదుగురు నిందితులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 18 ఏళ్ల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. బెయిల్ పొందిన నిందితుల్లో ఎ-3 పండుగ నారాయణరెడ్డి, ఎ-4 రేఖమయ్య, ఎ-5 భజన రంగనాయకులు, ఎ-6 వడ్డే కొండ, ఎ-8 ఓబిరెడ్డి ఉన్నారు. హైకోర్టు షరతుల ప్రకారం ప్రతి సోమవారం పోలీసుల ఎదుట హాజరు కావాలి. రూ.25వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. జైలు నుంచి విడుదలైన తర్వాత ప్రవర్తన సరిగా లేకపోతే బెయిల్ రద్దు చేస్తారు. 2005, జనవరి 24న అనంతపురం జిల్లా పెనుకొండలో టిడిపి నేత పరిటాల రవి హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురి నిందితులకు 18 ఏళ్ల తర్వాత బెయిల్ మంజూరు చేశారు. ఐదుగురిలో నలుగురు కడప నుంచి మరొకరు వైజాగ్ కోర్టులో బెయిల్ పొంది విడుదలయ్యారు.

ఎంఆర్‌పి ధరలకే ఎరువులు విక్రయించాలి

ప్రజాశక్తి - వల్లూరు : దుకాణం దారులు ఎరువులను ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువగా అమ్మ రాదని కడప వ్యవసాయ శాఖ సంచలకు శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వల్లూరులో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్‌లలో ఉన్నటువంటి ఎరువుల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల నిల్వలు, ఈ ఫోర్స్ మిషన్ నిల్వలు. స్టాక్ రిజిస్టర్‌లో బ్యాలెన్స్ వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మాత్రమే అమ్మాలన్నారు దుకాణదారుడు స్టాక్ బోర్డులో ఎరువుల ధరలను రాయాలని తెలిపారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి ఒక సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించి స్పెషల్ డ్రైవ్ ద్వారా దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం కడప జిల్లా శాఖ నాయకులు కోరారు. శుక్రవారం జడ్‌పి సిఇఒ ఓబులమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పిఎఫ్ సబ్‌స్క్రిప్షన్, మిస్సింగ్ క్రెడిట్లను, అలాగే ఫైనల్ పేమెంట్లు చెల్లింపు విషయంలో ఆడిట్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరారు. త్వరలో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపుతామని సిఇఒ హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న ఎపిజిబి అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమని సింహాద్రిపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్ పేర్కొన్నారు. మండలంలోని గురజాల గ్రామంలో సైబర్ మోసాలపై ఖాతాదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఒటిపి అడిగితే చెప్పకూడదన్నారు. తమ బ్యాంకు పేరు చెప్పి కొంతమంది సైబర్ నేరగాళ్లు ఒటిపి అడుగుతున్నారని తెలిపారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తమ బ్యాంకులో సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్‌పై అత్యధికంగా వడ్డీ ఇస్తున్నామన్నారు. ఖాతాదారుల అభ్యున్నతికి విరివిగా రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీని పరిశీలిస్తున్న తహశీల్దార్ రమాకుమారి

సొసైటీ రైతులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - చాపాడు

ఎస్‌సిలకు సంబంధించి సొసైటీ భూములను అర్హులైన వారికి అందేలా చూస్తామని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. సమస్యలు ఉన్న రైతులు సమావేశాల్లో అర్జీ ఇవ్వాలన్నారు. గ్రామ సర్పంచ్ శివప్రసాద్ మాట్లాడుతూ ఆన్‌లైన్ సమస్యలు ఉన్నాయని, సొసైటీ రైతులకు పాసుపుస్తకాలు మంజూరు చేయాలన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీ ఏర్పడగానే సర్వే చేసి అర్హులకు భూమి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, రీసర్వే డిటి నారాయణస్వామి, ఆర్ఐ శివశంకర్ రెడ్డి, సర్వేయర్ లక్ష్మీ నారాయణ, విఆర్ఒ పురుషోత్తం, టిడిపి నాయకులు వెంకట రమణారెడ్డి, ఇంద్రారెడ్డి, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ వరదకిషోర్‌రెడ్డి

భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి తెలిపారు. మంగపట్నం గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు, నిషేధిత భూ జాబితాలో నుంచి తొలగించాలని వినతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మహేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ రాజు, ఆర్ఐ సుదీప్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి పంట దిగుబడి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్లు పరిశీనలో నిర్ధారణ అవుతోంది. మండల పరిధిలో ఖరీఫ్‌లో సాగైన వరిలో పంటకోత ప్రయోగాన్ని మండల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు ఆధారంగా మండల వ్యాప్తంగా 16 రెవెన్యూ గ్రామాల్లో 64 మంది రైతులు పొలాల్లో ఖరీఫ్‌కు సంబంధించి పంట కోత ప్రయోగాలను చేపడుతున్నారు. కేతవరం గ్రామంలో శుక్రవారం నేషనల్ స్టాటిస్టికల్ సిబ్బంది ప్రయోగం నిర్వహించగా.. 15.170 గ్రాములు, ఎకరాకు 2,457కిలోలు దిగుబడి వచ్చినట్లు విఎఎ గోపిరామ్ తెలిపారు. ఆ ప్రకారం ఎకరానికి 28 నుంచి 32బస్తాల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రిన్స్ సౌరాసియా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కేతవరంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

జూదరులు అరెస్టు: నగదు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె సమీపంలో శుక్రవారం జూదం ఆడుతున్న ఏడు మందిని పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ సిబ్బందితో దాడి చేశారు. వీరినుంచి రూ.2,300నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

ఆర్‌టిసి బస్టాండ్ ప్రారంభానికి గ్రహణం వీడేనా..!

పనులు పూర్తయినా.. ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - వేంపల్లె

పనులు పూర్తయినప్పటికీ వేంపల్లె ఆర్‌టిసి బస్టాండ్ ప్రారంభానికి నోచుకోవడంలేదు. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్ ప్రారంభించనందున అది నిరుపయోగంగా మారింది. వేంపల్లె పట్టణ సౌకర్యార్థం వైసిపి ప్రభుత్వం హయాంలో గతేడాది శిథిలావస్థకు చేరుకున్న పాత బస్టాండు స్థానంలో కొత్త బస్టాండును నిర్మించారు. చిన్నచిన్న పనులు మినహా నూతన బస్టాండు దాదాపు పూర్తయింది. పనులు పూర్తయి కూడా రెండు నెలలు కావస్తున్నా ప్రారంభానికి గ్రహణం వీడలేదు. బస్టాండ్‌ను ప్రారంభించేందుకు అటు సంస్థ అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పులివెందుల నియోజకవర్గం వేంపల్లెలో నిర్మించిన నూతన బస్టాండు అధికారుల అలసత్వం కారణంగా నిరుపయోగంగా మారింది. రూ.2.20 కోట్లతో నిర్మించిన నూతన బస్టాండు కళావిహీనంగా దర్శనమిస్తోంది. అయిదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఈ బస్టాండ్‌లో పది నిమిషాలు ఆగేవి. నూతన బస్టాండు నిర్మిస్తుండడంతో బస్సులు రోడ్డుపైనే ఆగి ఆగనట్లుగా వెళ్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు వ్యయప్రయాసాలకోర్చాల్సి వస్తోంది. కనీస వసతులు సమకూర్చకపోవడంతో ప్రయాణికులు ఎండ, వానకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత వైసిపి ప్రభుత్వం నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టింది. ఇందులో ప్రయాణికులకు కనీస వసతులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు ప్లాట్‌ఫాంలతో బస్టాండు నిర్మాణం

వేంపల్లె ఐదు మండలాలకు కూడలిగా విస్తరించాలనే లక్ష్యసాధనకు నూతన బస్టాండు నిర్మాణం దోహదపడుతుందని భావించి గత వైసిపి ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో నిర్మించింది. ఈ బస్టాండు నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్, ఆరు ప్లాట్‌ఫాంలు, పార్సిల్ విభాగం, ఏర్పాటు చేశారు. వాష్ రూమ్, చిన్నచిన్న మౌలిక వసతులకు చెందిన పనులు కూడా పూర్తి చేశారు.

వినియోగంలోకి తేవాలని డిమాండ్

వేంపల్లె ప్రజల చిరకాల స్వప్నమైన బస్టాండ్ దాదాపు పూర్తి అయినప్పటికీ.. వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు తదితర సుదూర ప్రాంతాల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండు కార్యకలాపాలు ప్రారంభమైతే మాకీ తిప్పలు తప్పుతాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు, పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకుని బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వేంపల్లెలో ప్రారంభానికి నోచుకొని ఆర్‌టిసి బస్టాండ్

త్వరగా బస్టాండు ప్రారంభిస్తే సౌకర్యం

వేంపల్లె నుంచి ఇతర నగరాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయాల్లేక అవస్థలు పడుతున్నాం. త్వరగా ఆర్‌టిసి బస్టాండ్‌ను ప్రారభిస్తే ప్రయాణికుల ఇబ్బందులు తొలుగుతాయి. బస్టాండు వినియోగంలోకి తీసుకువస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

- గంగులయ్య, వేంపల్లె

అధికారులు చర్యలు తీసుకోవాలి

బస్టాండ్‌ను ప్రారంభించేందుకు అధికారులు, కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ధనంతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారకూడదు. రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేయాలి. రోడ్డు రవాణా శాఖ మంత్రి కూడా చొరవ చూపాలి. **- అన్నయ్య, వేంపల్లె**

ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తాం

వేంపల్లె ఆర్‌టిసి బస్టాండ్ పనులు పూర్తయ్యాయి. ప్రారంభానికి చర్యలు తీసుకొంటాం. ఆర్టీసీ జిల్లా అధికారులు దృష్టికి కూడా తీసుకెళ్లాం. బస్టాండ్‌ను ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తామం.

- రామకృష్ణ, ఆర్‌టిసి డిపో మేనేజర్, పులివెందుల

అంబేద్కర్‌పై వ్యాఖ్యలు సరికాదు


అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని ఈ విషయంలో వారిపై చర్యలు తీసుకోవాలని ఎపి మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు జాకట విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ దగ్గర ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విజయ్‌శేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రాకముందు ఉన్న జీవితాలు భారత రాజ్యాంగం వచ్చిక జీవితాలు ఎలా మారాయో గుర్తుం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమిత్ షా వెంటనే రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. ప్రస్తుతం హోం మంత్రిగా కూర్చున్నావంటే రాజ్యాం గమే అని, ఆ రాజ్యాంగం రాసింది అంబేద్కర్ అని గుర్తు చేసుకోవాలన్నారు. రాయలసీమ అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గూడెంచెరువు సంపత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పందిటి శ్రీనివాసులు, జమ్మలమడుగు నియోజకవర్గం యూత్ అధ్యక్షులు జె.దీపక్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు స్వరూప్, ప్రొద్దుటూరు కోశాధికారి గాలిపోతుల సామెల్, ప్రసాద్, పట్టణ అధ్యక్షురాలు శాంతమ్మ, రాష్ట్ర కార్యదర్శి సత్రి లక్ష్మయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవిడ్‌రాజు, మేకల శేఖర్, సంగటి పుల్లయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు.. ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వివి కొట్టాలు-వడియ రాజుపేట గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పదకొండేళ్ల క్రితం ఈ మార్గాన రోడ్డు నిర్మాణం చేపట్టారు. వివి కొట్టాల్ వద్ద రహదారి నిర్మాణంలో సమస్య ఏర్పడడంతో మధ్యలో ఆపేశారు. మిగిలిన ప్రాంతాన్ని పూర్తిగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. కేవలం 700 మీటర్ల పొడవు మాత్రమే రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం ప్రయాణానికి పూర్తిగా ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఈ మార్గాన వివి కొట్టాలు, వడియరాజుపేట, సోమాపురం, శ్రీరామ్ నగర్, ఎస్‌సి కాలనీ, సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లి, మొర్రాయపల్లి ప్రజలు మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపైకి ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వివి కొట్టాల్ వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి


ఆర్‌డిఒతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

దాల్మియా సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దాల్మియా సమస్యలపై స్పందించాలని వైసిపి ఎమ్మెల్సీ పి.రామ సుబ్బారెడ్డి ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీని కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన దాల్మియా బాధితులతో కలిసి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పిఆర్ మాట్లాడుతూ దాల్మియా సిమెంట్ పరిశ్రమపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జమ్మలమడుగు ఆర్‌డిఒ కూడా కమిటీ సభ్యులుగా ఉన్నందున మైలవరం మండలం దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న దుగ్గనపల్లె, నవాబుపేట గ్రామాల రైతులు, ప్రజల సమస్యలను అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను వివరించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

బద్రిపల్లెలో డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లె పంచాయతీ పరిధిలో శుక్రవారం డ్రెయినేజీ పనులు చేపట్టారు. సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి ఆధ్వర్యంలో నెర్రవాడ పాఠశాల సమీపంలో నిలిచి ఉన్న వర్షపు నీటిని జెసిబి యంత్ర సాయంతో తొలగించారు. కొన్ని రోజులుగా వర్షపు నీరు నిలుస్తూ దుర్గంధం వస్తోంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సర్పంచ్ సహకారంతో వ్యర్థ పదార్థాలను తొలగించారు. వర్షపు నీరు ప్రవహించేలా కాలువను ఏర్పాటు చేశారు. బద్రిపల్లెలో పలు చోట్ల పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త, టిడిపి నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, సచివాలయ ఇంజనీర్ అరుణ్ సాయి పాల్గొన్నారు.


పనులను చేయిస్తున్న పిఎస్, టిడిపి నాయకులు

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వై.సుబ్రహ్మణ్యం 100 పుస్తకాలను శుక్రవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణలకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వై.సుబ్రహ్మణ్యం బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో శ్రీవాల్మీకి మహర్షి ప్రణీతమ్ శ్రీమద్రామాయణమ్ (యుద్ధకాండం), ముకుందమాల భక్తితత్వం, శ్రీ సింహాద్రి నారసింహ శతకం, మాతృదర్శనం, టూకీగా ప్రపంచ చరిత్ర, సిరికోన భారతి, మహాభారతానుశీలనం, శ్రీమద్‌భాగవతం-నవమస్కంధం, గృహవైద్యం, హృదయం నీ నామం, శ్రీఅరుణాచలేశ్వరం, తెలుగు వ్యాకరణం వంటి గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన వై.సుబ్రహ్మణ్యంను యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.


పుస్తకాలు అందజేస్తున్న రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వై.సుబ్రహ్మణ్యం


అన్నదానం చేస్తున్న ఎస్.పి. జయరామిరెడ్డి

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం సింగారెడ్డి జయమ్మ వర్ధంతిని పురష్కరించుకొని అన్నదానం చేశారు. జయమ్మ పెద్ద కుమారుడు టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్‌పి జయరామిరెడ్డి వృద్ధులకు భోజనం వడ్డించారు. అనాథ వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సింగారెడ్డి జయచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, శివకృష్ణారెడ్డి, వార్డు మెంబరు వెంకటేష్, రామాంజీ, హరి కుమార్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

నేడు వృద్ధాశ్రమంలో అల్పాహారం

ప్రజాశక్తి - ఖాజీపేట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండ్ కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున కేక్ కట్ చేయడంతోపాటు, భూమాయపల్లె వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సుంకేసుల గ్రామంలో ఉన్న దివంగత సిఎం వైఎస్‌రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజరుకానున్నారని, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.


శనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ శివమోహన్ రెడ్డి

బుడ్డశనగ ప్రీమియం చెల్లింపు గడువు పెంపు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బుడ్డ శనగ సాగు చేసిన రైతులకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు పెంచిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ శివమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంకాలమ్మ గూడూరులో శుక్రవారం ఆయన ఇ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ బుడ్డ శనగ సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే, మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లింపును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు వ్యవసాయ అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల15తో ముగిసినప్పటికీ.. బీమా చెల్లించడంలో ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదురైనందున గడువు పెంచారన్నారు. రైతులు తమ ఇబ్బందులను అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స్పీడ్ బ్రేకర్ తొలగించరూ..!

సూచిక బోర్డు లేక తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు రోడ్డులోని ఆర్ఇఎస్ఎస్‌వి జూనియర్ కళాశాల, సాయిబాబా ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై అనధికారికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా ఉందని, దీన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు. కొన్ని నెలల క్రితం తాగునీటి అవసరాల నిమిత్తం పైప్‌లైన్ కోసం ప్రధాన రహదారిని తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత తవ్విన ప్రాంతంలో దారిని బాగు చేయడం మరిచారు. ఆ సమయంలో కూడా ప్రమాదాలు అధికంగా చోటుచేసుకున్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాల ఉండడంతో తవ్విన గుంతను స్పీడ్ బ్రేకర్‌గా మార్చారు. అయితే అక్కడ ఆ మేరకు సూచిక బోర్డు, గుర్తులుగానీ ఏర్పాటు చేయలేదు. ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ ఉందనే విషయాన్ని వాహనదారులు గమనించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ఒకరోజు వ్యవధిలోనే రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ స్పీడ్ బ్రేకర్ ఉన్న విషయాన్ని గుర్తించేలా సూచిక బోడ్డు అయినా ఏర్పాటు చేయాలి.. లేదా దాన్ని తొలగించాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

వైసిపి మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా హృషి కేశవరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



జిల్లా వైసిపి మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా జమ్మలమడుగుకు చెందిన ఆపార్టీ సీనియర్ నాయకులు వల్లంబాయి హృషి కేశవరెడ్డిని నియమించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తరువులు జారీ అయ్యా యని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి వైసిపి తరుపున బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ తరపున మున్సిపాలిటీలలో ఉన్న సమస్యలను గుర్తించి, ఆయా కౌన్సిలర్‌ల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డికి, జిల్లాస్థాయి వైసిపి నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మదీనా దస్తగిరి

ప్రజాశక్తి - చాపాడు



జిల్లా వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మైదుకూరు పట్టణానికి చెందిన మదీనా దస్తగిరిని పార్టీ అధిష్టానం నియమించినది. ఆ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడి నుంచి నియామక పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మదీనా దస్తగిరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైసిపి బలోపేతమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. వైసిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా తనపైన నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.